క్లుప్తంగా

విశేష అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు



పిడుగురాళ్ల: పట్టణం లోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆడి కృత్తిక సందర్భంగా ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విద్యతోనే దేశ పురోభివృద్ధి సాధ్యం



పిడుగురాళ్ల రూరల్: విద్యతోనే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి అన్నారు. మండలంలోని పందిటివారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పించారని ఆయన అన్నారు. విద్య, వైద్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధించటం జరిగిందన్నారు. సొసైటీ ఫర్ ఆల్ ఇన్ నీడ్ హైదరాబాద్ వారిచే విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్ పుస్తకాలను పంపిణీ చేయటం ఆనందంగా ఉందన్నారు. సంస్థ ఫౌండర్ రమణారెడ్డి, మతీష్‌రెడ్డిలు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయటం ఆనందకరమన్నారు. 150 మందికి 1200 నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.కోటేశ్వరరావు, రంగారెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడవద్దు



మాచర్ల రూరల్: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్ణీత సమయంలో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంపీడీవో కె.సరోజనీదేవి కోరారు. మంగళవారం మండల పరిధిలోని జెడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆమె మాట్లాడారు. విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగుతాయని, అలాంటి విద్యనందించటంలో ఉపాధ్యాయుల కృషి అమూల్యమన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించటంలో ప్రభుత్వ పథకాలను సక్రమంగా అందించటంలో ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏఎన్ఎం మరియమ్మ రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త హీనతతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐవీ నాగమణి, పంచాయతీ సెక్రటరీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది కృష్ణానాయక్, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1వ తేదీనే పింఛన్ పంపిణీ

సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 1వ తేదీన మాత్రమే జరుగుతుందని, దూర ప్రాంతాలలో ఉన్న పింఛన్‌దారులు వారికి అందజేసే ప్రదేశాలకు చేరుకోవాలని ఆమె కోరారు. అన్ని గ్రామ పంచాయతీ, సచివాలయాలలో ఉదయం 5 గంటల నుంచి పంపిణీ మొదలవుతుందని, 1వ తేదీ ఒక్క రోజు మాత్రమే పంపిణీ చేస్తామని, ఆలస్యంగా వచ్చిన వారికి ఇచ్చే అవకాశముండదని చెప్పారు. ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమనించాలన్నారు.

ముమ్మరంగా విద్యుత్ లైన్ల మరమ్మతులు



కారెంపూడి: మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు మంగళవారం పగలంతా జరిగాయి. దీంతో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానిక వినుకొండ రోడ్డులోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో ఏబీ నియంత్రికలు అమర్చడంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో మధ్యాహ్నం 3 గంటలకే కావాల్సిన పనిలో జాప్యం జరిగిందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని లైన్లలో విద్యుత్ సరఫరాకు ఆటంకంగా ఉన్న సమస్యలను పరిష్కరించారు. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు కొట్టడం, నూతన లైన్ల నిర్మాణ పనులు కొనసాగాయి. పగలంతా కరెంటు లేకపోవడంతో రైతులు, గృహ వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు.



మల్చింగ్ విధానంతో సాగు చేస్తున్న పంట

మల్చింగ్.. ప్రయోజనాలు మెండు

- నేలలో ఉష్ణోగ్రతలు పెరుగుదల
- క్రిమికీటకాల నుంచి రక్షణ
- రాయితీ అందిస్తున్న ఉద్యాన శాఖ

మాచవరం: సాగు నీరు లేనిదే పంటల సాగు సాధ్యం కాదు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ఆశించిన పంటల దిగుబడి రావడం లేదు. అధిక ఉష్ణోగ్రతలు, ఉన్న నీటితో సాగు చేయాలంటే రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఉన్న నీటి వనరులతో సాగు చేపట్టేందుకు ఉద్యాన శాఖ రైతులకు రాయతీలు కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తుంది. ఉద్యాన పంటలకు మల్చింగ్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంది. మల్చింగ్ విధానం వలన నేలలో అధిక ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించి మొక్కల పెరుగుదలకు ఎంతో దోహదపడుతుంది. క్రిమి కీటకాలు, చీడపీడల బెడద తగ్గుతుంది. దుక్కికి ముందు భూమిలో వేసిన పశువుల ఎరువులు, రసాయన ఎరువులు ఆవిరి కాకుండా నూరు శాతం మొక్కలకు అందుతాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మల్చింగ్ విధానం పలు రకాల పంటలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. కూరగాయలు, పండ్ల తోటలు, తీగజాతి తోటలు తదితర ఉద్యాన పంటల్లో దీన్ని అమలు చేయవచ్చు. మల్చింగ్ విధానంపై అనేక మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంపై ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ రైతులకు తగు సూచనలు, సలహాలు తెలియజేస్తున్నారు.

మల్చింగ్ షీట్ల రకాలు ఇలా...

మల్చింగ్ విధానంలో పంటల వయస్సును బట్టి పాలీఫిల్మ్ షీట్లను వాడాలి. ఇవి రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి పైభాగంలో సిల్వర్ రంగు, కింది భాగంలో నలుపు రంగు ఉంటాయి. రెండవది లోపలి భాగం, పైభాగం రెండూ నలుపు రంగులోనే ఉంటాయి. వార్షిక పంటలకు (కూరగాయలు, మిరప) 20 నుంచి 25 మైక్రాన్ల మందం, ద్వి వార్షిక పంటలకు (వంగ, దొండ) 40 నుంచి 45 మైక్రాన్ల మందం, బహుళ వార్షిక పంటలైన పండ్ల తోటలకు 50 నుంచి 100 మైక్రాన్ల మందం గల షీట్లు అవసరమవుతాయి.

ప్రభుత్వ రాయితీ...

మల్చింగ్ విధానంలో పంటలను సాగు చేసేందుకు రాష్ట్ర ఉద్యాన శాఖ రాయితీ అందిస్తుంది. ఒక్కో రైతుకు 50 శాతం రాయితీ ఇస్తుంది. ఉద్యాన శాఖ అధికారులు సూచించిన విధంగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు పాలీఫిల్మ్‌లను కొనుగోలు చేసి పంటలకు వినియోగిస్తే హెక్టారుకు యూనిట్ విలువ రూ.32 వేలు కాగా, సబ్సిడీపై రూ.16 వేలకు ఇస్తారు. ఎకరాకు రూ.16 వేలు కాగా రూ.8 వేలకు అందిస్తారు. రైతులు తాము చేపట్టబోయే పంటల వివరాలు, పొలం పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ అకౌంట్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, డీడీలు సమీపంలోని ఉద్యాన శాఖ అధికారికి అందజేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సబ్సిడీ అందించడం జరుగుతుంది.

మల్చింగ్ విధానం అనగా...

పంటల రక్షిత సాగులో భాగంగా వార్షిక, ద్వివార్షిక పంటలు, వంగ, దొండ, మిర్చి, పండ్ల తోటలు వంటి ఉద్యాన పంటల సాగులో పాలీఫిల్మ్‌లను (షీట్లు) భూమిపై కప్పి పంట సాగు చేసే విధానాన్నే మల్చింగ్ అంటారు.

మల్చింగ్ విధానం వలన ప్రయోజనాలు ఇలా...

భూసారాన్ని కాపాడుతుంది. భూమిలో తేమను సంరక్షిస్తుంది. భూమిలో సేంద్రియం పెరుగుతుంది. వేసిన ఎరువులు ఆవిరి కాకుండా ఉంటాయి.

- నేలలోని ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించి మొక్కలకు తేమ వాతావరణం కలుగుతుంది.
- వంటలో కలుపును పూర్తిగా నివారించవచ్చు. పంట సాగులో 40 శాతం ఖర్చులు తగ్గుతాయి.
- భూమిలో ఉండే చీడ పీడలకు, తెగుళ్లకు కారణమయ్యే బ్యాక్టీరియా, శిలీంధ్రాలు పూర్తిగా నశించిపోతాయి. షీట్ల పైభాగంలో సిల్వర్ రంగు వలన క్రిమి కీటకాలు పంటలను ఆశించవు.
- పంట పూర్తి అయ్యే వరకు డ్రిప్ ద్వారానే సాగు నీరు అందుతుంది కనుక మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. డ్రిప్‌తో వేసిన ఎరువులు పూర్తిగా మొక్కలకు చేరతాయి. ఎరువులు ఆవిరి కాకుండా నేరుగా మొక్కలకే చేరతాయి.
- భూమి పూర్తిగా గుల్లబారి మొక్కలకు కావాల్సిన నీరు, లవణాలు, పోషకాలు సకాలంలో అందుతాయి. ఒక్కో పాలీఫిల్మ్ షీట్లను రెండు పంటలకు వినియోగించుకోవచ్చు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం ఉద్యాన పంటల సాగులో అధికంగా పెట్టుబడులు పెరిగాయి. అయినా సరైన దిగుబడులు రావడం లేదు. మల్చింగ్ విధానంతో పెట్టుబడులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి. మల్చింగ్ విధానంపై ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–వై.మోహన్, ఉద్యాన శాఖ అధికారి

నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ



మాచర్ల రూరల్: జలశక్తి అభియాన్, నారీ శక్తి సే జల్ శక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సరోజనీదేవి నేతృత్వంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా నీటిని పొదుపు చేసే విధానం, సంరక్షణ గురించి ప్రజలను చైతన్య పరచాలని ఆమె కోరారు. నీటి ఎద్దడి రాకుండా వృధాను ఎలా అరికట్టవచ్చో తెలుపుతూ ఎంపీడీవో జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్‌డీ కోటేశ్వరరావు, ఐటీడీఏ ప్రత్యేకాధికారి ఎంవీ రాజు, ఉపాధి ఏపీవో నాగశ్రీనివాస్, వెలుగు ఏపీఎం దాసు, యానిమేటర్స్, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యక్తి మిస్సింగ్‌పై కేసు



రమావత్ నాగు నాయక్ (ఫైల్ ఫొటో)

దుర్గి: మండలంలోని మంగాపురం తండాకు చెందిన ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని భార్య సంధ్యా బాయి దుర్గి పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన రమావత్ నాగునాయక్ అనే వ్యక్తికి 27 సంవత్సరాలుంటాయన్నారు. నాగు నాయక్‌పై దుర్గి పోలీసు స్టేషన్‌లో కేసు ఉన్నందున వాయిదా నిమిత్తం గుంటూరు కోర్టులో హాజరుకు ఈ నెల 23న తెల్లవారు జామున 4 గంటలకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హత గల కౌలు రైతులందరికీ కార్డులివ్వండి



రికార్డులను పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

మాచర్ల రూరల్: అర్హత కలిగిన కౌలు రైతులకు నిర్ణీత సమయంలో కౌలు రైతు కార్డులను అందించాలని గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పంటలు సాగు చేసే సమయంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతో అవసరమని, వీటిని వీలైనంత తొందరగా అందించాలని కోరారు. తహసీల్దార్ల బదిలీల్లో ఏర్పడ్డ జాప్యాన్ని నివారిస్తూ ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేస్తూ పెండింగ్ లేకుండా చూసుకోవాలని కోరారు. వర్షాల వలన ఏమైనా పంటలు దెబ్బతిన్నాయా, ఆస్తి, ప్రాణ నష్టం ఏమైనా జరిగాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సివిల్ సప్‌లెస్ గోడౌన్‌ను పరిశీలించి నిర్ణీత సమయంలో కార్డుదారులకు సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, సివిల్ సప్‌లెస్ డీటీ మురళీధర్, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్లు రంగారావు, షేక్ మస్తాన్‌వలి, వీఆర్‌వోలు తదితరులున్నారు.

పార్టీల పేరుతో రాజకీయం మా అభిమతం కాదు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, అధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల: నియోజకవర్గంలో పార్టీల పేరుతో రాజకీయాలు చేయడం తమ పార్టీ అభిమతం కాదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి నీటి సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. పురపాలక సంఘం తరఫున విద్యుత్ శాఖకు రూ.5 కోట్లు బకాయి ఉన్నదెవరో తెలుసుకోవాలన్నారు. మాచర్ల పట్టణానికి ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, బాధ్యులకు శిక్ష పడేలా చేస్తామన్నారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరయ్యారు. మున్సిపాలిటీ ఎంత దీన స్థితిలో ఉందో చెప్పాల్సిన బాధ్యత గత ప్రభుత్వ అధికారులు, నాయకులపై ఉందన్నారు. ఫిల్టర్ బెడ్ మరమ్మతులకు గురై, నాలుగు రోజులు నీటి సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడడానికి కారణం తెలపాలని మున్సిపల్ చైర్మన్‌ను మాచర్ల చిన్న యేసోబును ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. రూ.కోట్లు అక్రమార్జనకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి వార్డు అభివృద్ధిపై చర్యలు చేపడతామన్నారు. పురపాలక సంఘ అభివృద్ధికి కట్టుబడి ఉండి, ఐదు సంవత్సరాల్లో మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. చైర్మన్ మాచర్ల చిన్న యేసోబు ఆధ్వర్యంలో జరిగిన చర్చలో అన్న క్యాంటిన్ ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు చర్చించగా, దీనిపై ఆమోదించారు. మాచర్ల పురపాలక సంఘం పరిధిలో రూ.35.4 లక్షల గ్రాంట్ నిధులు వివిధ పథకాల మంజూరుపై మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఇందుకు బాధ్యులైన గత మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రిసిటీకి రూ.5 కోట్లు బకాయి ఉన్న నేపథ్యంలో రూ.42.11 లక్షలు తాత్కాలికంగా చెల్లించడంపై కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కౌన్సిలర్ మధార్ సాహెబ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 40 నెలల్లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయని, బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సందర్భంగా వికలాంగులకు వీల్ చైర్స్ కొనుగోలుకు సంబంధించి రూ.1.16 లక్షలు బిల్లు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది కౌన్సిలర్లు సోమవారం రాత్రి గుంటూరులో ఉన్న జూలకంటి బ్రహ్మానందరెడ్డి నివాసానికి వెళ్లి పార్టీ కండువాలు కప్పించుకుని ప్రతి అంశానికి ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసిన వారిలో వివిధ వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్నారు. టీడీపీ ఏకగ్రీవంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లపై దృష్టి సారించి కౌన్సిల్ సమావేశంలో తమ తీర్మానానికి మద్దతు తెలిపేలా చేశారు. మున్సిపల్ సమావేశానికి టీడీపీ కండువాలు కప్పుకుని హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్, డీఈ మధుసూధనరావు, ఏఈ ఆదిత్య, చంద్రశేఖర్, ఆర్వో షబ్బీర్, వెంగయ్య పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



గడ్డితో నిండి ఉన్న పాఠశాల పరిసరాలు

కారెంపూడి: స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా శాఖ కార్యవర్గం మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. ఆ పాఠశాలను విజిట్ చేయడం జరిగిందని పాఠశాల మైదాన ప్రాంతం గడ్డి, పిచ్చి చెట్లతో ప్రమాదకరంగా ఉందని బోరు నిరుపయోగంగా ఉందని పేర్కొన్నారు. కరెంటు లేకపోతే వినియోగించుకునేందుకు వీలుగా బోరును రిపేరు చేయించాలని ప్రిన్సిపాల్ రమేష్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. పీఎస్, తెలుగు బోధించే టీచర్లు లేకపోవడం వల్ల పదవ తరగతితో పాటు ఇతర తరగతుల విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టీచింగ్ స్టాఫ్ కన్నా ఎక్కువ జీతాలు వస్తున్నాయని పేర్కొన్నారు. నూతన విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందించలేదని అన్నారు. పల్నాడు జిల్లా ఎన్ఏసీహెచ్ఆర్ఐ అధ్యక్షుడు గరికపాటి శంకరరావు, ప్రతినిధులు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, బాబూరావు, వరప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాలలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే



రెంటచింతల: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చేపట్టిన ఇంటింటి సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుందని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో 42 బృందాల ద్వారా ఇప్పటి వరకు 8,476 ఇళ్లను, 26,846 మందిని పరీక్షించి 28 మంది కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి రెంటచింతల పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి ఉన్నవారు ఆరోగ్య కార్యకర్త వద్ద ఎం.డి.టి మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఏడీ శర్మ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.కోటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, నిర్మల, ఎంపీహెచ్‌ఏ మహేష్‌బాబు, సీతారామిరెడ్డి, ఖాసిం, ఆరోగ్య కార్యకర్తలు తదితరులున్నారు.

జలశక్తి అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



జలశక్తి అభియాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న జలశక్తి అభియాన్ క్యాచ్ ద రెయిన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద జలశక్తి అభియాన్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షం ఎక్కడ, ఎప్పుడు కురిసినప్పటికీ ఆ వర్షపు నీటిని ఒడిసి పట్టడమే లక్ష్యంగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2021లో ప్రపంచ జలదినం అయిన మార్చి 22న ప్రారంభించిన ఈ పథకంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజలలో అవగాహన కల్పించడంలో భాగంగా గ్రామ, పట్టణ పురవీధులలో ర్యాలీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటికి మూలాధారం వర్షం అనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా చేపట్టిన జలశక్తి అభియాన్‌లో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామ పరవీధులలో ర్యాలీ నిర్వహించి జాతీయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, మర్రి రాజ్‌కుమార్, ఎన్.శ్రీనివాసరావు, సిద్దయ్య, ఉపాధి పథకం ఏపీవో జయచంద్ర కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కారెంపూడి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి సర్వ సిద్ధం చేశామని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. కలెక్టర్‌తో జరిగిన వీసీ అనంతరం ఎంపీడీవో సంబంధిత సచివాలయ శాఖ ఉద్యోగులతో మంగళవారం రాత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బుధవారమే అందరికి పింఛన్ల పంపిణీకి సంబంధించిన మొత్తం కేటాయించడం జరుగుతుందని, ఒకటో తేదీన ఒకే రోజు పంపిణీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీడీవోతో పాటు ఐదుగురు మానిటరింగ్ అధికారులు మండల ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్ పర్యవేక్షణలో పని చేస్తారని తెలిపారు. మండలంలో మొత్తం 7,632 పింఛన్‌దారులకు గాను 65 మంది మృతి చెందారని చెప్పారు. పింఛన్‌దారులందరూ ఇళ్ల వద్దనే ఉండి పింఛన్లు తీసుకోవాలని ఉద్యోగులు కూడా వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించాలని అన్నారు.

అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు



పిడుగురాళ్ల: డయేరియా ప్రభావిత ప్రాంతాలే కాకుండా మిగిలిన ప్రాంతాల్లో కూడా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ముక్త కంఠంతో తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సమావేశంలో ఈ నెల 3వ తేదీ నుంచి పిడుగురాళ్ల పట్టణంలోని మారుతీ నగర్, లెనిన్ నగర్ ప్రాంతాల్లో డయేరియా సోకి సుమారు ఏడుగురు మృతి చెందారు. ఆ సమయంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పర్యటించి పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కేవలం డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో మాత్రమే పారిశుద్ధ్య పనులు చేపట్టారని పలువురు కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. పట్టణంలోని 12వ వార్డు, గాంధీనగర్ వంటి ప్రాంతాల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉండటంతో డయేరియా ఎక్కువ మందికి సోకి ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే వ్యాపార కూడళ్లలో, జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఏ రోజు చెత్తను ఆ రోజు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి తెలిపినప్పటికీ ఎవరు స్పందించటం లేదని మరో సభ్యుడు తెలిపారు. కృష్ణానదిలో నీటి శాతం తగ్గిపోవటంతో పట్టణానికి కృష్ణాజలాలు పూర్తిస్థాయిలో అందటం లేదని, నీటి వసతి లేని ప్రాంతాల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని మరో కౌన్సిలర్ చెప్పారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ... పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని, 1వ వార్డు నుంచి 18వ వార్డు వరకు ఒక సెక్షన్‌గా, 19వ వార్డు నుంచి 33వ వార్డు వరకు మరో సెక్షన్‌గా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అలాగే నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. గతంలో కౌన్సిల్ సమావేశానికి ముందు పట్టణంలో ఏయే వార్డులలో పనులు నిర్వహించాలని చర్చించే సంప్రదాయం ఉండేదని, నేడు ఏకపక్షంగా కౌన్సిలర్లకు తెలియకుండా అజెండా కాపీలో ఆయా వార్డుల పనులు నమోదు చేయటం సరికాదని ఓ కౌన్సిలర్ సభ దృష్టికి తీసుకురాగా చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్నందున అన్ని ప్రాంతాల్లోని పనులకు సంబంధించి అజెండా కాపీ తయారు చేయటం జరిగిందని తెలిపారు. ముందుగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దీన్, కౌన్సిలర్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.